
ప్రాణాలకు ఖరీదు

● నేరాలు చేసినా తప్పించుకు తిరుగుతున్న బడాబాబులు
● చాలా ఘటనల్లో పోలీసుల వైఖరి వివాదాస్పదం

న్యూస్‌టుడే, గద్వాల, మహబూబ్‌నగర్ నేర విభాగం

ఏదో ఒక పనిచేసుకుని జీవనం సాగించే బీదాబిక్కీ ప్రజలు అన్యాయానికి, అఘాయిత్యానికి గురైతే అండగా నిలవాల్సిన వ్యవస్థలు సరిగా స్పందించడం లేదు. నిందితులు రాజకీయ పలుకుబడితో పోలీసులను ఉపయోగించి, తప్పుడు కేసులు పెట్టి, భయపెట్టి నోరెత్తకుండా చేస్తున్నారు. బాధితులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారి ప్రాణాలకు కూడా ఖరీదు కడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యాచార ఘటనలు, బాలికల ఆత్మహత్యలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి చనిపోవటం, రోడ్డు ప్రమాద మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే. ఘటనలపై ఎంత మంది గొంతెత్తినా, పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చినా చివరికి డబ్బు, రాజకీయ పలుకుబడితే పైచేయి అవుతోంది. కేసులు నీరు గారుస్తుండటం పరిపాటిగా మారింది. తాజాగా గద్వాల జిల్లాలో జరిగిన ఘటన చర్చనీయాంశమవుతోంది.



మచ్చుకు కొన్ని ఘటనలు..

● గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక చేయని నేరం మోపారని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎన్ని విమర్శలు వచ్చినా పోలీసులు అడుగు ముందుకు వేయలేదు. కీలక ప్రజాప్రతినిధి జోక్యంతోనే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి కుటుంబానికి పెద్దఎత్తున డబ్బు ఆశ జూపినట్లు ఆరోపణలు వచ్చాయి.

● ధరూరు మండలంలో కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎన్నో అనుమాలు ఉన్నా కుటుంబ సభ్యులను ఒప్పించి చేసి ప్రమాదవశాత్తు చెరువులో మునిగినట్లుగా లెక్కలు గట్టి కేసును నీరుగార్చే ప్రయత్నంలో పెద్ద మనుషులు సఫలయ్యారు.

● గద్వాల మండలంలో ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు ఇప్పించారు.

● కేటీదొడ్డి మండలం ఉమిత్యాలలో యువకుల వేధింపుల కారణంగా ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. సామాజిక మాధ్యమాలు, ప్రతికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చాక గానీ పోలీసులు స్పందించలేదు. చివరికి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా బాలిక ప్రాణానికి వేధించటంతో అవమాన భారంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పరువుపోతుందని కుటుంబ సభ్యులు ఇతర కారణాలు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడు మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు.

● గట్టు మండలంలో పేలుళ్లతో ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందితే కంపెనీ ప్రతినిధులపై నామమాత్రంగా కేసులు నమోదు చేశారు.

● నాగర్‌కర్నూల్‌లో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందగా ఇసుక మాఫియా మొత్తం రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్కబెట్టారు.

● దేవరకద్ర మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలే స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. అయినా ఒక్కరిపైనే కేసు నమోదైంది.

● కొల్లాపూర్ మండలంలోని ఓ తండాలో చెంచు మహిళను తీవ్రంగా కొట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చాలామందిపై ఆరోపణలు ఉన్నా, దాడి వీడియోలు బయటకు వచ్చినా కేసు మాత్రం నలుగురిపైనే నమోదు చేశారు.

ఆసుపత్రి మరణాలపై కేసులేవీ..

● గద్వాలలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పది నెలల వ్యవధిలో వైద్యం వికటించి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వైద్యులు బాధిత కుటుంబాలకు ఎంతో కొంత సొమ్ము ముట్టజెప్పి ఆస్పత్రులపై కేసులు కాకుండా చూసుకున్నారు.

● ఈ ఏడాది జులైలో ఓ మహిళ కడుపు నొప్పితో నాగర్‌కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా వైద్యం వికటించి మృతి చెందింది. బంధువులు ఆందోళనకు దిగటంతో కొంత డబ్బు ముట్టచెప్పి వైద్యులు తమపై కేసు కాకుండా చేసుకున్నారు.

● నాగర్‌కర్నూల్‌లోని మరో ఆస్పత్రికి వచ్చిన మహిళకు రక్తం తక్కువగా ఉన్నా ఆపరేషన్ చేయటంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ధర్నాకు దిగటంతో కొంత డబ్బిచ్చి నోరు నొక్కేశారు.

కల్తీ కల్లు మరణాలు ఎన్నో.. : మహబూబ్‌నగర్‌లో కల్తీ కల్లు తాగి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. ముగ్గురు మృతిచెందినా అనారోగ్యమే కారణమని కొట్టిపారేస్తూ కల్లు డిపోల నిర్వాహకులపై కేసు నమోదు కాలేదు. మానవపాడు మండలంలోని ఓ గ్రామంలో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతిచెందినా ఇలాగే చేశారు. బల్మూరు మండలం, జడర్ల పరిసరాల్లో కల్తీ కల్లు తాగి కొందరు మృతిచెందినా కేసులు నమోదు కాలేదు.

అనుమతి ఉందిగా.. అడిగేదెవరు?

ఇష్టానుసారంగా రెట్టింపు మట్టి తరలింపు


ఊర్కొండ సమీపంలోని వత్తడిగుట్టల నుంచి మట్టి తరలిస్తున్న వాహనాలు

కల్వకుర్తి, న్యూస్‌టుడే : జాతీయ రహదారుల నిర్మాణం పేరిట అనుమతుల మాటున మట్టి దందా జోరుగా సాగుతోంది. గడువు దాటినా యథేచ్ఛగా మట్టిని తరలిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. జాతీయ రహదారి నిర్మాణం పేరిట అనుమతి తీసుకొని గడువు దాటినా.. నిర్మాణంగా మట్టి తరలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసుకొని అక్రమంగా మట్టిని తరలించి దళారులు రూ.కోట్లు దండుకుంటున్నారు.

గడువు 60 రోజులే.. : ఊర్కొండ మండల కేంద్రం వత్తడిగుట్ట సర్వే నంబరు 244 దాదాపు వందల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. రూ.886.69 కోట్లతో చేపట్టిన 167కె కల్వకుర్తి-కరివెన జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిని తరలించటానికి, జిల్లా మైనింగ్ శాఖ నుంచి 13 జూన్ 2024 నుంచి 60 రోజుల గడువు లోపు 10వేల మెట్రిక్ టన్నుల మట్టి లేదా కంకరను తరలించుకునేలా అనుమతి తీసుకున్నారు. ప్రభుత్వానికి రూ.2 లక్షల రాయల్టీ, రోడ్డు పర్మిట్ కోసం రూ.4 వేలు చెల్లించారు. అనుమతి గడువు దాటి నెల రోజులైనా ఇప్పటికే గుట్ట నుంచి రోజు తప్పి రోజు మట్టిని తరలిస్తూనే ఉన్నారు. వందలాది వాహనాల్లో తరలిస్తుండటంతో చెల్లించిన రూ.2 లక్షల రాయల్టీకి వంద రెట్లు మట్టి తరలించుకొని రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.

ఆరు నెలల నుంచి రవాణా.. : కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామం 167 కె జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రాళ్ల గుట్ట సర్వే నంబరు 522లో దాదాపు 58 ఎకరాల్లో విస్తరించి ఉంది. 8 ఎకరాల వరకు ఇప్పటికే పలువురు ఆక్రమించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాళ్ల గుట్ట నుంచి జాతీయ రహదారి నిర్మాణానికి మట్టి తరలింపునకు అనుమతి తీసుకున్నారు. ఆరు నెలల నుంచి లక్షల మెట్రిక్ టన్నుల మట్టి తరలించారు. తరలించిన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు గల పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం ఇక్కడి నుంచే మట్టిని తరలిస్తూనే ఉన్నారు. ఇక్కడి నుంచి రాత్రి సమయంలో కొందరు అక్రమార్కులు మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. లక్షల మెట్రిక్ టన్నుల మట్టి మాయమైంది.

టాస్క్ ఫోర్స్

అధికారులేమంటున్నారంటే.. : తుర్కలపల్లి సమీపంలోని గుట్ట నుంచి మట్టి తరలింపు అనుమతులు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమిస్తామని కల్వకుర్తి తహసీల్దారు ఇబ్రహీం తెలిపారు. ఒకవేళ అనుమతులు లేకుండే మట్టిని తరలించకుండ నిలుపుదల చేస్తామన్నారు.

● ఊర్కొండ వత్తడిగుట్టల నుంచి మట్టిని తరలించటానికి జాతీయ రహదారుల పనులు చేపట్టిన గుత్తేదారు తీసుకున్న అనుమతి గడువు దాటింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి తీసుకుంటామని తహసీల్దారు రాంకోటి పేర్కొన్నారు. జిల్లా మైనింగ్ అధికారి రవీందర్‌ను చరవాణి ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నాగర్‌కర్నూల్ పట్టణాభివృద్ధి సంస్థ ఆవిర్భావం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలతో పాటు జిల్లాలో 319 గ్రామాలను దీన్ని కిందకి తెచ్చారు. ఛైర్మన్‌గా కలెక్టర్, వైస్ ఛైర్మన్‌గా అదనపు కలెక్టర్‌తో పాటు ముగ్గురు సభ్యులు ఇందులో ఉంటారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్ నాయకుడు కల్లపు సతీశ్ దశదినకర్మ సందర్భంగా సీఎం ఉదయం 11 గంటలకు మద్దూరుకు చేరుకొని సతీశ్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. నిడ్జింత రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతంలు పరిశీలించారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి సబిత

కందనూలు, న్యూస్‌టుడే : ఆడపిల్లలు తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి సబిత అన్నారు. శుక్రవారం ప్రపంచ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఒకే సముదాయంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తున్నా చాలా ప్రాంతాల్లో బాలికలపై వేధింపులు, దాడులు, అక్రమ రవాణా జరగడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు పేదరికం తదితర కారణాలతో అమ్మాయిలకు బాల్య వివాహాలు చేస్తున్నారని, ఇలా చేయడం చట్టవిరుద్ధమన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి స్వచ్ఛంద సంస్థల సభ్యులు, మహిళా సంఘాలు, శిశు సంక్షేమశాఖ, పోలీసు శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆడ పిల్లలకు ఏవైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధైర్యంగా చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ స్వరూప, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పేరొస్తుందనే రాద్ధాంతం

గ్రూప్‌-I అభ్యర్థులను ప్రతిపక్షాలు రెచ్చగొట్టాయి : మంత్రి శ్రీధర్ బాబు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పాలమూరు,. న్యూస్‌టుడే : రాష్ట్రంలో రాత పరీక్ష నిర్వహించి గ్రూప్‌-1 పోస్టులు భర్తీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాలు అభ్యర్థులను రెచ్చగొట్టాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసే అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్‌-1 ఉద్యోగాల ప్రకటన ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిందని, ప్రిలిమ్స్ పూర్తయి మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక ప్రతిపక్షాలు కుట్రలు చేశాయని ఆరోపించారు. పరీక్షకు నాలుగు రోజుల ముందు నుంచి అభ్యర్థులతో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయించాయని ఆరోపించారు. 9 నెలల నుంచి రాని అనుమానం.. ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 2011లో తాము అధికారంలో ఉన్నప్పుడు వేసిన గ్రూప్‌-1 ప్రకటనతో అనేక మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో గ్రూప్‌-1 ప్రకటన ఇచ్చిందన్నారు. 500 పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. భారాస 10 ఏళ్లలో 40వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50వేల కంటే ఎక్కువ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగ ప్రకటనలు ఇస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతలదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 65 ఐటీఐ కళాశాలలను రూ.2,300 కోట్ల నిధులు వెచ్చించి ఆధునీకీకరిస్తున్నట్లు తెలిపారు. టాటా సంస్థ సహకారంతో డిమాండ్ ఉన్న కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్, షాద్‌నగర్, మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ బదావత్ సంతోష్


కొండారెడ్డిపల్లిలో రహదారి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లిలో ప్రారంభించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో సీసీదారులు, మురుగుకాల్వల నిర్మాణం, నాలుగు వరుసల రోడ్డు నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రధాన రహదారి నుంచి రూ.2 కోట్లతో చేపడుతున్న మిషన్‌భగీథ పైపులైన్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. జిల్లాలోని నాలుగు పురపాలికలతో పాటు గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న దారుల మరమ్మతులకు ప్రజాప్రతినిధులను సంప్రదించి ప్రతిపాదనలు పంపాలని పుర కమిషనర్‌లకు, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఆర్డీవో శ్రీను, కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనుల నోడల్ అధికారి జీవీ రమేశ్, పంచాయతీరాజ్, ర.భ, పుర కమిషనర్లు పాల్గొన్నారు.

పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో 21వ జాతీయ పశుగణన పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో పశుగణన గోడపత్రికలు, నియమావళి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నాలుగు పురపాలికలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పశుగణనకు 20 మంది పశుగణనకర్తలు, 78 మంది పర్యవేక్షకులను నియమించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని కుటుంబాలను సర్వే చేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలతో పాటు 16 రకాల పశువుల, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వీటి ఆధారంగా నిధులతో పాటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు సరఫరా అవుతాయన్నారు. వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేశ్, ఏడి డా. జ్ఞానశేఖర్, డా. రాజేశ్, జీవిత, ప్రవీణ్, సంతోష్, శ్రావణి పాల్గొన్నారు.

బాధితులకు 105 చరవాణుల అప్పగింత

కందనూలు, న్యూస్‌టుడే : చరవాణి పోతే వెంటనే అంతర్జాలంలో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రికవరీ అయిన చరవాణిలను బాధితులకు అందజేసి ఎస్పీ మాట్లాడారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వలన చోరీకి పాల్పడిన చరవాణిలు రికవరీ అవుతున్నాయని చెప్పారు. జిల్లా ఐటీ కోర్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి 105 చరవాణిలను స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఐటీకోర్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వరదతో పనుల్లో జాప్యం

పెద్దకొత్తపల్లి మండల కేంద్రం మీదుగా కొనసాగుతున్న 167 కే జాతీయ రహదారి పనులకు వర్షాలు ఆటంకం కలిగిస్తున్నాయి. రహదారి పక్కన ఉన్న వాగుల నుంచి నీరు భారీగా పని ప్రదేశాల్లోకి చేరుతోంది. సాతాపూర్ సమీపంలో చేపట్టిన కల్వర్టు వద్దకు వరద నీరు రావడంతో మోటారు సాయంతో తోడివేస్తున్నారు. దీంతో పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది.

\- న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం

పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం: జూపల్లి


సోమశిలలో పర్యటక బోటును ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పురఛైర్‌పర్సన్ మేకల రమ్యకుమారి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సోమశిల గ్రామంలో పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కాటేజీలు, ఘాట్‌లను పరిశీలించి పర్యాటకులతో మాట్లాడారు. టూరిజం శాఖ బోటును ప్రారంభించి కృష్ణా నదిలో విహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నదీ పరివాహక ప్రాంతాలను మల్లేశ్వరం వద్ద ఉన్న ఐ ల్యాండ్ ప్రాంతాన్ని, సింగోటం, జటప్రోలు, అమరగిరి ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి చేస్తామన్నారు. ఆర్కిటెక్చర్ రాందేవ్‌రావుతో సోమశిల, కొల్లాపూర్ పట్టణంలోని రోడ్డు మధ్యలో ఉన్న విభాగినిని తీర్చిదిద్దుతామన్నారు. సోమశిలలోని వీఐపీ ఘాట్ సమీపంలో స్నానగదులకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి, కౌన్సిలర్ నయీం, మాజీ జడ్పీటీసీ హనుమంత్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు లేక వెతలు

● మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల పరేషాన్

● పండగ వేళ అవస్థలు



పెద్దకొత్తపల్లిలో తెల్లవారుజామునే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం, కల్వకుర్తి : పల్లెల పరిశుభ్రతకు కీలకమైన పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలందడం లేదు. రెండు నెలలుగా అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. దసరా పండగకు వేతనాలు రాకపోగా కనీసం దీపావళికైనా వస్తాయోనన్న ఆశతో కార్మికులు ఉన్నారు. సకాలంలో రాకుంటే పండుగకు పస్తులుండాల్సిందేనా అని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

● గ్రామపంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సరిగా రావటం లేదు. ఒప్పంద కార్మికులుగా నియమించుకున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. పంచాయతీల్లో పన్నుల వసూలు అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. నిత్యం శ్రమకోర్చి రహదారులు ఊడ్చటం, చెత్త తొలగింపు, మురుగు కాల్వల శుభ్రత వంటి పనులు చేపట్టడుతున్నా.. కార్మికులను విస్మరిస్తున్నారు. నిత్యం ఉపాధి హామీపనులకు హాజరైనా నెలకు దాదాపు రూ. 6వేలకు పైగానే అందుకునే వీలుంది. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధులకు వెళ్తున్నా సకాలంలో వేతనాల అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,420 మంది పారిశుద్ధ్యకార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత జులై వరకే వేతనాలు అందించారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంచాయతీలు
1,684
పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
7,420
మూడు నెలల వేతన బకాయిలు
రూ.14.09 కోట్లు

కార్యదర్శులపై ఒత్తిడి : రెండు నెలలుగా పంచాయతీలకు కూడా నిధులు సరిగా రావడంలేదు. దీంతో పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ కొనుగోలు, ఇతర ఖర్చులతోడై పంచాయతీలు అప్పుల కుప్పగా మారుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలు 550 దాకా ఉన్నాయి. వీటి నిర్వహణ మరింత భారంగా మారింది. కొన్ని చోట్ల కార్యదర్శులు అప్పులు తెచ్చి పారిశుద్ధ్య కార్మికుల చేతి ఖర్చులకు ఇస్తున్నారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులపై ఒత్తిడి పెరిగింది. నిధులు లేక వేతనాలు ఇవ్వలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.


నిత్యం అప్పులతో..: రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. . గ్రామాల్లో పెద్ద పండుగ దసరా మా ఇళ్లల్లో చిన్నబోయింది.. దీపావళి కూడా జరుపుకొనే పరిస్థితి కన్పించడంలేదు. సరకులు కొందామన్నా ఆర్థిక ఇబ్బందులతో మా పరిస్థితి దయనీయంగా ఉంది.



- రాజేందర్, పెద్దకొత్తపల్లి పారిశుద్ధ్యకార్మికుడు

ఒక నెల సర్దుబాటు చేస్తాం..: పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక నెల వేతనాల నిధులు మంజూరయ్యాయి. వీటిని అందించేందుకు ఇప్పటికే ఆయా మండలాలకు వివరాలు పంపాలని సూచించాం. నివేదికలు రాగానే ప్రస్తుతానికి ఒక నెల వేతనాలు అందిస్తాం. - రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్

భావి తరం నిర్మాతలు మీరే



బడి బాట పట్టించండి

ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో బడి మానుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులతో వలస పోతే, మరి కొందరు పనులకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ బడికి పంపేలా ఒప్పించాలి.

● **ఉదాహరణ:** హన్వాడ పాఠశాలలో పనిచేస్తున్న జయప్రద ప్రతి వారం విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి బడికి పంపేలా చూస్తున్నారు.



హన్వాడలో పిల్లలను బడిబాట పట్టిస్తున్న ఉపాధ్యాయులు

కృత్యాధార బోధన

మామూలుగా చెప్పడం కన్నా కృత్యాలతో చేసి చూపిస్తే పిల్లల మనసుల్లో నాటుకుంటుంది. అందుకు కావలసింది ఓపిక, సృజనాత్మక ఆలోచనలే.

● మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్‌లో పనిచేస్తున్న దశరథరాంరెడ్డి కృత్యాలతో ఆకట్టుకుంటున్నారు. ఒక్కొక్క తరగతికి ఒక్కో చిన్న చిన్న నమూనాలు అమలు చేస్తున్నారు. దస్తాల, చిన్నపార్ల పాఠశాల్లో అక్షరమాలలు, అట్టపెట్టలతో చతుర్విధ ప్రక్రియలను తయారు చేసి ఉపాధ్యాయులు ఔరా అనిపించారు.



వేపూర్‌లో విద్యార్థులతో మమేకమై బోధిస్తున్న దశరథరాంరెడ్డి

మంచి అలవాట్లు నేర్పించాలి

గురువులు ఏది అనుసరిస్తే విద్యార్థులు ఆ మార్గంలో పయనిస్తారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు తమ జీవితాలపై పాఠశాలలో గురువుల ప్రభావం ఉందని చెబుతారు. బాల్యదశలో మంచి అలవాట్లు నేర్పిస్తే పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారు.

● **ఉదాహరణ:** ఊట్కూరు మండలం చిన్నపొర్ల పాఠశాలలో పనిచేస్తున్న నరేందర్ పిల్లలకు చదువు తప్ప ఇతర పనులు చెప్పకుండా తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ఉదయం అయిదు గంటలకు లేచి చదువుకునేలా ప్రోత్సహించారు. ఇంతకు ముందు తాను పనిచేసిన మందిపల్లితండాలో 22 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. వ్యక్తిగత పరిశుభ్రత, శ్రమ విలువ నేర్పారు.




చిన్నపొర్లలో బోధిస్తున్న నరేందర్

సామాజిక బాధ్యత చెప్పాలి

భవిష్యత్తు, బాధ్యత వారిదే అనే విధంగా విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉంది. విలువలు, సామాజిక బాధ్యత చెప్పాలి.

● వనపర్తి జిల్లా యాపర్ల ఉన్నత పాఠశాలలో శంకర్ గౌడ్ అమ్మనాన్నలకు నిత్యం పాదపూజ చేసి పాఠశాలకు రావాలని చిన్నారులకు సూచిస్తూ అలవాటుగా మార్చారు. బాల్య వివాహాన్ని అడ్డుకొని పోలీసులతో కలసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కోస్గి మండలం ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో వార్ల మల్లేశం ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పక్షిజాతుల సంరక్షణ వంటి పనులను ప్రత్యక్షంగా పిల్లలతో చేయిస్తున్నారు.





బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న శంకర్

ఇటీవల డీఎస్సీలో ఎంపికై కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. .

జిల్లా	ఎస్ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేషన్
మహబూబ్ నగర్	35	22	07	144	06
నాగర్ కర్నూల్	66	13	02	129	0
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణ పేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05

వృత్తికి న్యాయం చేయాలి

వృత్తికి కట్టుబడి ఉండాలి. ఎంతో నమ్మకంతో గురువుల చేతిలో పిల్లలను పెడతారు. తాను చేస్తున్నది ఉద్యోగం కాదని, సమాజ నిర్మాణంలో భాగస్వామ్యమని గుర్తించాలి.

● నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నముద్దునూర్ పాఠశాలలో రాజశేఖర్‌రావు ఈ విషయంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఈయన ప్రతి పిల్లాడిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎదిగేలా చూస్తున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ రావు

ఆట,పాటలకు ప్రాధాన్యం



విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్న భూపని గోపాలం

పిల్లలకు ఆటలు దూరం కావడంతోనే నేడు ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం ఉంటే వారు ఇష్టంగా చదువుపై ఆసక్తి కనబరుస్తారు.

● మక్తల్‌కు చెందిన భూపని గోపాలం పనిచేసిన సమయంలో ఎంతోమందిని తీర్చిదిద్దారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బుతో పేదపిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. జాతీయ స్థాయికి 62 మంది వెళ్లగలిగారంటే ఆయన నిబద్ధతను ప్రశంసించాల్సిందే. క్రీడాపాఠశాలకు 42 మంది విద్యార్థులు ఎంపికకావడానికి ప్రత్యేక శిక్షణ అందించారు. క్రీడాకారులకు తన సొంతడబ్బులతో పాటు దాతల నుంచి సేకరించిన నగదుతో అన్ని వసతులు సమకూర్చుతున్నారు.

ఇథనాల్ కంపెనీ సందర్శనను అడ్డుకున్న పోలీసులు




గుండ్లంపల్లి గ్రామస్థులను అడ్డుకున్న మరికల్ పోలీసులు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ఇథనాల్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గుండ్లంపల్లి గ్రామస్థులు నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ ప్రాజెక్టును, పరిసర గ్రామాలను సందర్శించడానికి శుక్రవారం వచ్చారు. వంద మంది రెండు బస్సుల్లో వచ్చారని తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున మరికల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సులను నిలిపేశారు. సందర్శనకు ఎలాంటి అనుమతి లేదంటూ బస్సుల్ని వెనక్కి మళ్లించి పోలీసు సహాయంతో జడ్చర్ల వరకు తీసుకెళ్లి వదిలేశారు. ఈ సంఘటనపై చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ పర్యటనను అడ్డుకోవడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు ఎం.రాఘవచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలకులు మారినా పరిస్థితి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి జట్టుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో సాధన చేస్తే తప్పక విజయం వరిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడాసాధన చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని దాని వల్ల జీవితంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా తట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మొత్తం 16 పాఠశాలల నుంచి 540 మంది క్రీడాకారులు పోటీ పడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణా మండలి సభ్యుడు బాలాజీసింగ్, ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు, ఫుట్‌బాల్ అసోషియేషన్ సభ్యుడు కేశవులు, కౌన్సిలర్‌లు బాలునాయక్, రవిందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, సతీష్, సీఐ నాగార్జున పాల్గొన్నారు.

క్రీడ	విజేత	రన్నర్
కబడ్డీ	కల్వకుర్తి	తాడూర్
వాలీబాల్	కల్వకుర్తి	నర్వ
ఖోఖో	కల్వకుర్తి	ఉయ్యాలవాడ
చెస్	కల్వకుర్తి	వేపూర్
క్యారం	హన్వాడ	వెల్టూర్

విజేతలు వీరే..

మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. అత్యధిక క్రీడల్లో కల్వకుర్తి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓరల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.

బాలిక మృతిపై అనుమానాలెన్నో...!

ప్రభుత్వ వ్యవస్థల తీరుపై విమర్శలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యలో అనేక అనుమానాలు, పలు కోణాలు వెలుగుచూస్తున్నాయి. దొంగతనం జరిగింది గద్వాలలో అయితే మల్దకల్ పోలీసుస్టేషన్‌లో ఎలా విచారించారనే దానికి సమాధానం దొరకడం లేదు. దొంగతనం, పోలీసుల విచారణ భయంతో అవమానంగా భావించి బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి కర్నూల్ ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలిక ఆత్మహత్యకు యత్నించిదనే విషయం బహిర్గతం కావడంతో తొలుత కార్మిక శాఖ, ఆ తరువాత జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు స్పందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆయా శాఖల్లో స్పందన లేదు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు విచారణ, కేసులు అంటున్నారు తప్పితే బాలికకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులను విస్మరించారని పలువురు మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బాలికపై దొంగతనం అభియోగం మోపిన వెంటనే మైనర్లను పనిలో ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించి ఉంటే ఈ రోజు బాలిక మృతిచెంది ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా పోలీసులు ఎందుకు విచారణ చేపట్టలేదనే విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. గత కొంత కాలంగా జిల్లాలో అధికార వ్యవస్థలు నాయకుల పలుకుబడి ముందు చట్ట నిబంధనలు పనికి రానివిగా చేస్తున్నారని న్యాయనిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూల్ ఆసుపత్రికి వెళ్లాం: బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిన వెంటనే కమిటీ సభ్యులం కర్నూల్‌లో చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లాం. అప్పటికే బాలిక అపస్మారక స్థితిలో ఉంది. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగాం. వారు ఏమీ చెప్పలేమనడంతో వివరాలు నమోదు చేసుకుని తిరిగి వచ్చాం.

-సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి

29న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఈనెల 29న జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌తో ఉదయం 9గంటలకు కోచ్ ఖలీల్‌ను నివేదించాలని సూచించారు.

పోటీలే లక్ష్యంగా ఆడండి



జట్లతో క్రికెట్ సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నీలో సత్తా చాటితే తప్పక రంజీ స్థాయికి ఎదగవచ్చని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ మూడో రోజు నాగర్‌కర్నూల్- వనపర్తి మధ్య నిర్వహించిన వన్డే మ్యాచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే తప్పకుండా తుది జట్టులో చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, అశోక్, సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ విజయం: అండర్-23 అంతర్ జిల్లాల టోర్నీలో నాగర్‌కర్నూల్ జట్టు వనపర్తి జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. తరుణ్ 35, సాయిరాం 19, కృష్ణ 18 పరుగులు చేశారు. వనపర్తి బౌలింగ్‌లో ఛత్రపతి 4, దినేశ్, ప్రణీత్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్‌గౌడ్ 56, ప్రణీత్ 34 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి అభినవ్ 4, జశ్వంత్ 2 వికెట్లు తీశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అండర్ 17 ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన పాత మక్తల్ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వనపర్తి జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ మేఘూరావు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఎంజేపీ సొసైటీ ఏటా వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వనపర్తి జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ మేఘూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీల విజేతలకు ప్రిన్సిపల్ గురువయ్యాగౌడ్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా మక్తల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థి జి.శివ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ బహుమతి అందుకున్నారు. కబడ్డీలో ప్రథమ స్థానంలో నవాబ్‌పేట గురుకుల పాఠశాల, ద్వితీయ స్థానంలో మక్తల్, ఖోఖోలో నవాబ్‌పేట ప్రథమ, ద్వితీయ చిట్యాల, వాలీబాల్‌లో మక్తల్ ప్రథమ, సీసీ కుంట ద్వితీయ, టెన్నికాయిట్‌లో చిట్యాల ప్రథమ, ద్వితీయ బూర్గుపల్లి గురుకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. చదరంగం పోటీల్లో కడుకుంట్ల ప్రథమ, కేటీ దొడ్డి ద్వితీయ, క్యారమ్స్‌లో సింగోటం ప్రథమ, కడుకుంట్ల ద్వితీయ, డిస్క్ త్రోలో మంజునాథ్ ప్రథమ (ధర్మాపూర్), ద్వితీయ డి.జయంత్ (చిట్యాల), షాట్‌పుట్‌లో ప్రథమ పి.రవీందర్ (చిట్యాల), ద్వితీయ వినయ్ (మక్తల్), హైజంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమ కె.అఖిల్‌గౌడ్ (కేటీ దొడ్డి), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి) నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో అంబటి పల్లి గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మక్తల్ విద్యార్థులు, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో జి.శివ(మక్తల్), ద్వితీయ స్థానంలో చందు (చిట్యాల), 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి), 3 కి.మీ. ప్రథమ కార్తిక్ (అంబటిపల్లి), ద్వితీయ వంశీ (నవాబ్‌పేట), 100 మీటర్లలో ప్రథమ భీముడు (అంబటిపల్లి), ద్వితీయ జి.శివ (మక్తల్), 200 మీటర్లలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ శరత్ (కల్వకుర్తి), 400 మీటర్లలో ప్రథమ శరత్ (కల్వకుర్తి), ద్వితీయ జి.శివ (మక్తల్) నిలిచారు.

వేలం పాటలతో ఆలయాలకు రూ.3.35 కోట్ల ఆదాయం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. మొత్తం రూ.3,35,82,000 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. గతేడాది రూ.1.76 కోట్లతో పోలిస్తే ఈ సారి దాదాపు రెట్టింపు వచ్చినట్లయింది. వేలం పాటలో 40 మందికి పైగా పాల్గొన్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలంపాట అత్యధికంగా రూ.1.27 కోట్లు పలికింది. వాహన పార్కింగ్ రూ.77 లక్షలు, చీరలకు రూ.91 లక్షలు, ఫొటోలు, క్యాసెట్లు, పుస్తకాలకు రూ.22 లక్షలు, దేవస్థాన వసతి భవన నిర్వహణకు రూ.9.50 లక్షలు, శౌచాలయాల నిర్వహణకు రూ.7.20 లక్షలు, క్యాంటిన్ నిర్వహణకు నెలకు రూ.76 వేలకు పాటదారులు పాడుకున్నారు. పాట దక్కించుకున్న వారు నవంబరు 24వ తేదీ లోగా 50 శాతం డబ్బులు చెల్లించి డిసెంబరు 1వ తేదీ నుంచి ఆలయాల వద్ద విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఈవో వివరించారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి ..

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే : మద్దిమడుగు శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం వేలం మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అచ్చంపేటకు చెందిన వ్యాపారి నర్సిరెడ్డి రూ.48 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అయితే గతేడాది రూ.40.52 లక్షలు పలికింది. కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణకు సరైన వేలం రాకపోవటంతో వాయిదా వేశారు. త్వరలో మరో తేదీని ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో రంగాచారి, పాలక మండలి ఛైర్మన్ రాములు నాయక్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115-00
రిటైల్	137-00
డ్రెస్డ్	199-00
స్కిన్‌లెస్	226-00



✔ నాగర్‌కర్నూల్‌లోని పాత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పురపాలక శాఖ నిర్మించిన మూత్రశాల నిరుపయోగంగా ఉంది. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు మూత్ర విసర్జనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నాగరాజు, నాగర్‌కర్నూల్

✔ పరిశీలించి ప్రజలు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

✔ నాగర్‌కర్నూల్ ఎర్రగడ్డ కాలనీలో ఎల్ఈడీ దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. విలువైన విద్యుత్తు వృథా అవుతోంది.

– శివకుమార్, నాగర్‌కర్నూల్

✔ వీధి దీపాలు పట్టపగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.

● పై రెండు ప్రశ్నలకు పురపాలక సంఘం కమిషనర్ నరేశ్‌బాబు సమాధానం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, కందనూలు

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. : రవి : **దేవర**
కల్వకుర్తిలో..పార్థసారథి : **వెనమ్ ది లాస్ట్ డాన్స్**
అశోక్ : **విశ్వం**

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 60, వంకాయ 64, బెండ 64, మిరప 80, కాకర 64, బీర 64, క్యాప్సికమ్ 75, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 44, ఉల్లిగడ్డ 50, గోకర 64, దోస 45, ఆనకాయ 18, చిక్కుడు 68, చామగడ్డ 60, మునగకాయ 64, బీటరూట్ 50, బీర 45, బీన్స్ 95.

బాల్యంలోనే మూడు ముళ్లు

ప్రత్యేక అధికారులను నియమిస్తేనే కట్టడి



నాగర్‌కర్నూల్ : బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కందనూలు, న్యూస్‌టుడే : ప్రతి జిల్లాలో బాల్య వివాహాల నిషేధ అధికారులు (సీఎంపీవో)ను ప్రత్యేకంగా నియమించాలి. వారికి ఈ ఒక్క బాధ్యతనే అప్పగించాలి. ఇతర విధులు అప్పగించకూడదు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత సీఎంపీవోలదే. ప్రతి మూడు నెలలకు ఒకసారి పనితీరు పర్యవేక్షించాలి. జిల్లా కలెక్టర్, ఎస్పీ భాగస్వాములై బాల్య వివాహాలను నిర్మూలించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఈనెల 18న చేసిన వ్యాఖ్యలు ఇవీ..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల చర్యలు చేపట్టినా ఇప్పటికి కొందరు ఆడ పిల్లలను భారంగా భావించి చిన్నతనంలోనే చదువులకు దూరం చేస్తూ వివాహాలు చేసి వారి జీవితాన్ని అంధకారంలోకి నెడుతున్నారు. తెలిసి తెలియని వయస్సులో వివాహాలు చేయడం వలన ఆరోగ్యపరంగా, వివిధ రకాల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ, సఖి కేంద్రం, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న క్షేత్రస్థాయిలో కొందరు బాల్య వివాహాలను చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో గణాంకాలు ఇలా..

	అడ్డుకున్న బాల్య వివాహాలు
2022	32
2023	27
2024	32 (అక్టోబర్ 22 వరకు)

కమిటీలున్నా.. : జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రభుత్వం జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గ్రామసర్పంచులు సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహాలను అరికట్టి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ఈ ఏడాది ఎనిమిది నెలల్లో 32 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2022 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 22 వరకు 91 బాల్య వివాహాలను అడ్డుకున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని కోడేరు, తెల్కపల్లి, తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

సమష్టిగా కృషి చేస్తేనే.. : తల్లిదండ్రులు బలవంతంగా వివాహాలు చేస్తే డయల్ 1098, 100కు సమాచారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు వివరిస్తున్నారు. బాల్య వివాహాలు అరికట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం, వివాహాల నమోదు ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులు వివరాలు నమోదు చేసుకోవడం లేదు. గ్రామస్థాయి కమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమష్టిగా పని చేస్తేనే అడ్డుకోవడానికి వీలవుతుందని ఇందుకు చొరవ తీసుకుంటున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పర్యవేక్షణాధికారి రాజేశ్వరి పేర్కొన్నారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా బస్సులు



సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రోజు సమీపంలోని కొన్ని గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులు సరైన సమయానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో 'బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు' శీర్షికన ఈ నెల 23న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అచ్చంపేట ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. విద్యార్థులకు అనుకూలంగా బస్సును నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 4.40 గంటలకు కొండనాగుల నుంచి బస్సు బయలు దేరుతుందని అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బస్సు ఏర్పాటుతో బిల్లకల్, లక్ష్మీపల్లి, సీతారాంపూర్, తోడేళ్లగడ్డ, రామాజిపల్లి, వీరారంజిపల్లి, బాణాల, మైలారం, అచ్చంపేట తదితర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉందని సాయంత్రం సకాలంలో ఇంటికి చేరుతాని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగితే వెంటనే తమ దృష్టికి తెస్తే సమస్యను పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకుంటామని డీఎం పేర్కొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

గ్రంథాలయ ఛైర్మన్‌కు హైకోర్టు న్యాయవాదుల సత్కారం

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన అచ్చంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపురం రాజేందర్‌ను హైకోర్టు న్యాయవాదులు శుక్రవారం సత్కరించారు. అచ్చంపేటలోని ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఈ పదవి రావడం హర్షణీయమని, మరింత రాణించాలన్నారు.



రాజేందర్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

గాలింపునకు కదిలిన చెంచులు

లింగాల, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రపెంట అడవిలోకి దుంపల కోసం వెళ్లి అదృశ్యమైన నిమ్మల శంకర్‌ను వెతికేందుకు శుక్రవారం ఎర్రపెంటకు చెందిన చెంచులు స్వచ్ఛందంగా కదిలారు. బృందంగా నల్లమలలోకి వెళ్లి శంకర్ అదృశ్యమైన ప్రాంతాలను గాలింపు చేస్తున్నారు. వెంట తాగునీరు, భోజనం తీసుకువెళ్లారు. బృందం వెంట కొందరు మహిళలు కూడా వెళ్లారు. వేములపాయ, తప్పెట గుండం, బిక్కిటి పెంట, చింతగుండం తదితర ప్రాంతాల్లో గాలించారు. మాజీ సర్పంచులు బాల గురువయ్య, నన్నయ్య, బాజపా మండలాధ్యక్షుడు సలేశ్వరం, ఎఫ్‌బీవోలు రమేష్, ప్రవీణ్, వాచర్లు తదితరులు గాలింపుల్లో పాల్గొన్నారు.



ఎర్రపెంట తప్పెటగుండం అడవిలో గాలింపు చర్యల్లో ఎఫ్‌బీవోలు, చెంచు యువకులు

కేంద్ర పథకాలు వివరిస్తూ సభ్యత్వ నమోదు



యువకులతో భాజపా సభ్యత్వ నమోదు చేయిస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ భాజపా సభ్యత్వ నమోదు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు. ప్రతి కార్యకర్త 100 మందితో సభ్యత్వాలు చేయించాలన్నారు. కార్యకర్తలంతా 30లోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రజలను కలిసి సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వావిలాల రమేష్, జిల్లా కార్యదర్శి కె.సైదులు, జగన్‌గౌడ్, మండల నాయకులు ఎ.సురేందర్‌రెడ్డి, బ్రహ్మచారి, మహేష్, ఆంజనేయులు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. నిండు కుండలా మారిన జలాశయం నుంచి దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు 2 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి 55,782 క్యూసెక్కులు కుడి, ఎడమ జల విద్యుత్కేంద్రాల ద్వారా 67,006 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు జలాశయంలో 884.60 అడుగులుగాను, నీటి నిల్వ 213.4011 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి 63,176 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 63,105 క్యూసెక్కుల ప్రవాహం జలాశయానికి చేరుకుంటోంది.



శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

తెలకపల్లి, న్యూస్‌టుడే : వర్షాల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండల సముదాయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, తాగునీటి ఎద్దడి నివారించాలని, నర్సరీల ఏర్పాట్లు, నవంబర్ మొదటి వారంలో ఉపాధి హామి పథకం పనులపై సామాజిక బృంధం తనిఖీలు ఉంటాయని వివరించారు. ఏపీవో మల్లేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెంచుపెంటలో డీఆర్డీవో పర్యటన

అమ్రాబాద్, న్యూస్‌టుడే : లోతట్టు అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, వారి జీవన శైలిని డీఆర్డీవో చిన్న ఓబులేశు పరిశీలించారు. శుక్రవారం మల్లాపూర్ చెంచు పెంటను సందర్శించి చెంచులతో మాట్లాడారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఇతర రుణాలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితులు, వైద్య బృందాల సంచారం గురించి అడిగారు. స్త్రీనిధి రీజనల్ మేనేజర్ మహేంద్రకుమార్, చెంచు డీపీఎం లక్ష్మయ్య, సీసీ మల్లేష్ పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం

ఊర్కొండ, న్యూస్‌టుడే : రంగారెడ్డి జిల్లా మాడ్గుల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి శుక్రవారం ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద రూ.లక్షతో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. దాతల చొరవతో ఆలయంలో వసతులు సమకూరుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి పేర్కొన్నారు. అర్చకులు దత్తాత్రేయశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేడ బుడగజంగాలలకు న్యాయం చేయండి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : బేడబుడగ జంగాలకు రావాల్సిన హక్కులను వర్తింపజేయాలని బీజేహెచ్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి కేవీఎల్ఐ అతిథి గృహంలో సమావేశమై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు. జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో బేడబుడగ జంగాల వారు వెనకబడి పోయారన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గగనం మంతప్ప, శ్రీనివాసులు, దేవరాజు, కృష్ణయ్య, మల్లికార్జున్, రవి, నాగరాజు, పెద్దనరసింహ, నిరంజన్ పాల్గొన్నారు.



బేడ బుడగజంగాల కమిటీ సభ్యులను సన్మానించిన నాయకులు

ఆధార్ అనుసంధానానికి చొరవ తీసుకోండి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : రేషన్‌కార్డుదారులందరూ నవంబర్ 15 లోపు ఆధార్ అనుసంధానం చేసుకునేలా డీలర్లు చొరవ చూపాలని తహసీల్దార్ కార్తికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 37 రేషన్ దుకాణాల్లో 31,228 రేషన్‌కార్డుల్లోని సభ్యులు ఇప్పటికే ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకున్నారన్నారు. రేషన్‌డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు బియ్యం అందజేయాలన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్ శ్రీనువాసులు, ఆర్ఐ శంకర్‌నాయక్, సిబ్బంది గణేశ్, సహదేవ్, దయాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కార్తిక్‌కుమార్

డీఏ ప్రకటించాలని వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు కోరారు. ఐదు విడతల డీఏ బకాయిలు ఉన్నందున దీపావళి కానుకగా కనీసం రెండు విడతల బకాయిలు చెల్లించాలన్నారు. ఏటా జనవరి, జులైలో నిత్యావసర సరకుల ధరల సూచీ ఆధారంగా డీఏను ప్రకటిస్తారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నందున సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

గోదాం నిర్వహణ తీరుపై ఆగ్రహం



గోదాంలో నిల్వలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండల చౌకధర గోదాం నిర్వహణ సరిగ్గా లేదని జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం గోదాంను తనిఖీ చేసి, బతుకమ్మ చీరల సంచులు, ఇతర సంచులు అస్తవ్యస్తంగా పడి ఉండటం చూసి గోదాం ఇన్‌ఛార్జి రవూఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ పాయింట్ నుంచి డీలర్ల వద్దకు బియ్యం రవాణా సక్రమంగా జరగాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరణి సమస్యలను ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఉపకార వేతనాలు మంజూరు చేయాలి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు, బోధనా రుసుముల బకాయిలు వెంటనే మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బోధనా రుసుములు మంజూరు చేయకపోవడం వలన ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్వాహకులు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యాద్, కార్తీక్, తరుణ్, సుల్తాన్, సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం సాగిస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పరమేశ్ సాయిప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దకొత్తపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాబూరావు, ఉదయభాస్కర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

కందనూలు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. నవంబర్ 3న నిర్వహించనున్న మొదటి ఆవిర్భావ మహా సమ్మేళనం గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సమావేశంలో నాయకులు సురేశ్, శివ, రమేశ్, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : ఈ నెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలన్నారు. మాల ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు హరిచంద్ర, బాలస్వామి, మల్లిఖార్జున్, అంజి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ అభివృద్ధే లక్ష్యం

కొల్లాపూర్ పట్టణం : ఉమ్మడి మాలమూరు జిల్లాలో ఉన్న డీసీసీ బ్యాంకుల అభివృద్ధే లక్ష్యమని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని డీసీసీ బ్యాంకులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కొల్లాపూర్, పాన్‌గల్ సింగిల్‌విండోలు రూ.42 కోట్ల రుణమాఫీ పొంది ఉమ్మడి జిల్లాల్లో మొదటి స్థానంలో నిలిచాయన్నారు. డీసీసీబీలో నెట్ బ్యాంకింగ్ అందుబాటులోకి రావడంతో ఖాతాదారుల సంఖ్య పెరిగిందన్నారు. సింగిల్ విండోల ఛైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,376

అచ్చంపేట : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన 18 మంది రైతులు 240 క్వింటాళ్ల (480 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం అమ్మకానికి తెచ్చారు. మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,376, మాదిరి ధర 2,211, కనిష్ఠ ధర రూ. 1,801 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

కేసులను రాజీ మార్గంలో పరిష్కరించండి



మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జడ్జి జ్యోత్స్న సూచించారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. డిసెంబరులో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ మార్గంతో పరిష్కరించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, లోక్‌అదాలత్ సభ్యులు కురుమూర్తి, మోహన్‌లాల్, ఇన్‌ఛార్జి భోగ హరికృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

నాగర్‌కర్నూల్, పెంట్లవెల్లి, న్యూస్‌టుడే : ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని ప్రవర్షకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ ట్రస్టు ద్వారా రూ.75 వేలు అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో ప్రవర్షతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. నారాయణపేట వైద్య కళాశాలలో సీటు వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నట్లు తెలియడంతో మాజీ ఎమ్మెల్యే స్పందించారు. మరో మూడేళ్ల పాటు కళాశాల ఫీజును తమ ట్రస్టు ద్వారా చెల్లిస్తానని వారికి చెప్పారు.

మాదిగ సన్నాహక సమావేశానికి తరలిరావాలి

చారకొండ (వెల్దండ గ్రామీణం) : ఈనెల 30న జడ్చర్ల పట్టణంలో మాదిగ సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధర్యంలో జరుగుతున్న ఈ సమావేశానికి ఎస్సీ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

తిమ్మాజిపేట: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా శుక్రవారం తిమ్మాజిపేటలో ఇంటింటి సర్వే ప్రారంభించారు. తిమ్మాజిపేటలోని 22 ఇళ్లను గుర్తించి వారికి అందుతున్న ఆరోగ్య పథకాల వివరాలను తెలుసుకున్నారు. తాగునీటితో సహా వివిధ సంక్షేమ పథకాలు, ఏర్పాట్లు, ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. మండలంలోని మరో ఎనిమిది గ్రామాల్లో 24 రోజులపాటు ఈ సర్వే చేపట్టనున్నట్టు సర్వే బృందం పర్యవేక్షకులు లింగమ్మ తెలియజేశారు. వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.ఇస్మాయిల్, సిబ్బంది , ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సహకరించారు.

పెండింగ్ పనుల పూర్తి కట్టుబడి ఉన్నాం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం పెండింగ్ పనుల పూర్తికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం క్రీడా ప్రాంగణం, పార్కు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో గ్యార్వీ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుర ఛైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యామ్‌సుందర్, ఆర్డీవో మాధవి, డీఎం దుర్గాప్రసాద్, గోపాల్‌రెడ్డి, కాశన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కమిషన్ సభ్యుడిని కలిసిన నాయకులు

వంగూరు: వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియామకమైన కేవీఎన్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నాయకులు కలిశారు. సంపతి రాజేందర్‌రెడ్డి, శ్రీధర్, రాము తదితరులు శాలువాలతో సత్కరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : యాసిడ్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్ట్యతండాకు చెందిన బీక్య (40) ఈనెల 18న తాగునీరు అనుకొని యాసిడ్ తాగారు. అన్న శంకర్ వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. భార్య చిట్టి, నలుగురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్వి చక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో

ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం కల్వకుర్తి తెల్కపల్లి ప్రధాన రహదారిపై పంజుగుల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై మాధవరెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన షానవాజ్‌ఖాన్, అనూప్‌శర్మ ద్విచక్ర వాహనంపై కల్వకుర్తికి వస్తుండగా అదే మార్గంలో వేగంగా వెళ్తున్న ఆటో వారిని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

వంగూరు, న్యూస్‌టుడే : తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడిన సంఘటన వంగూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం. . రంగాపూర్ గ్రామానికి చెందిన ఎండపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఉదయం ఊరికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం విరగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బీరువాల తాళాలు తీసి అందులో ఉన్న మూడు కిలోల వెండి వస్తువులు, మూడుతులాల బంగారం, రూ.4 వేల నగదును అపహరించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్ల వేలం.. రూ.39 వేల ఆదాయం

కొల్లాపూర్ పట్టణం, కోడేరు, న్యూస్‌టుడే : కోడేరు మండలంలో కోళ్ల స్థావరంపై పోలీసులు దాడులు చేసి పట్టుబడిన కోళ్లకు కోర్టుకు అప్పగించారు. వీటికి శుక్రవారం వేలం వేయగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. కొల్లాపూర్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి జ్యోత్స్న 12 కోళ్లకు వేలం వేశారు. రూ.39,650 రాగా ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజనాకు జమ చేసినట్లు కోర్టు అధికారులు చెప్పారు. పందెంరాయుళ్లు పరారీలో ఉండగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై గోకారి చెప్పారు.

గుట్కాల విక్రేతపై కేసు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్ఆర్ పాన్‌షాపులో గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రెండో ఎస్సై రాచందర్‌జీ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. రూ.2 వేల విలువైన ప్యాకెట్లు పట్టుబడినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని దుకాణ యజమాని అబ్దుల్ మిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా స్వాధీనం

ఊర్కొండ, న్యూస్‌టుడే : ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అమ్మపల్లితండా, ఠాగూర్‌తండా, రాంరెడ్డిపల్లిలో దాడులు నిర్వహించి 400 లీటర్ల పాకం, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎస్సై అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగు చేస్తామని సైబర్ మోసం

రూ.2 లక్షలు వసూలు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన వివాహిత నజ్మాబేగంనకు సెప్టెంబర్ 7న ఇన్‌స్టాగ్రామ్‌లో అజ్మీర్ దర్గా పేరుతో ఒక ప్రకటన వచ్చింది. ఆ ప్రకటనలో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే నయం చేయడంతో పాటు కుటుంబంలో ఎలాంటి మానసిన సమస్యలున్నా దేవుని అనుగ్రహంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దీంతో కుమార్తె ఆరోగ్యం కోసం బాధితురాలు సంప్రదించారు. సెప్టెంబర్ 7 నుంచి ఈనెల 6 వరకు గుర్తు తెలియని వ్యక్తులు వేర్వేరు చరవాణి నంబర్ల ద్వారా బాధితురాలితో మాట్లాడారు. మొదట ఈనెల 7న రూ. 2,200 ఆన్‌లైన్‌లో జమ చేసింది. అనంతరం దఫాలుగా రూ. 2.20 లక్షలు వారు సూచించిన ఖాతాకు జమ చేసింది. శుక్రవారం మళ్లీ ఫోన్ చేసి కుమార్తె ఆరోగ్యం మెరుగు పడాలంటే మళ్లీ రూ. 3 లక్షలు ఇవ్వాలని అడిగారు. అనుమానం వచ్చిన బాధితురాలు ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోవర్దన్ తెలిపారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని నియోజకవర్గం వారికి ఈనెల 28, 29న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి 200 మందికి వివిధ కంపెనీల ప్రతినిధులు రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

వంగూరు, న్యూస్‌టుడే : ఎన్నికల హామీ మేరకు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం న్యాయం చేయకపోతే ప్రతి పల్లెలో ఉద్యమాలు చేయడానికి వాల్మీకిలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రమౌళి, రమేష్, సలేశ్వరం, వెంకటస్వామి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైను పగిలి...

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : చెన్నపురావుపల్లిలో గురువారం రాత్రి అకస్మాత్తుగా మిషన్‌భగీరథ పైపులైను పగిలిపోయింది. దీంతో కరెంటు స్తంభం ఎత్తులో నీరు విరజిమ్మడంతో పక్కనే ఉన్న ఇంట్లోకి నీరు చేరి గోడలకు ఎర్తింగ్‌తో విద్యుత్ ప్రసరణ అయ్యింది. దీంతో భయాందోళన చెందారు. నీటి ఒత్తిడికి పైపులైన్ పగిలిపోయినట్లు మిషన్‌భగీరథ సిబ్బంది తెలిపారు. శుక్రవారం పైపులైన్ మరమ్మతు చేసినట్లు ఏఈ శివశంకర్ తెలిపారు.